క్లుప్తంగా

విత్తన దుకాణాల్లో తనిఖీలు



నరసరావుపేట రూరల్: పట్టణంలోని విత్తన దుకాణాల్లో వ్యవసాయ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ పి.మస్తానమ్మ ఆధ్వర్యంలో స్టేషన్ రోడ్డులోని దుకాణాల్లో తనిఖీలు జరిపి దుకాణాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలని, డీలర్లు సోర్స్ సర్టిఫికెట్స్ కలిగి ఉన్న విత్తనాలు మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని తెలిపారు. ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్ వివరాలు తెలియజేసేలా ధరలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు.

వేల్పూరులో జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో నూతనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని గురువారం తెలిపారు. నూతన జూనియర్ కళాశాలలో బాలురు–బాలికలకు ప్రవేశం ఉందని, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. ఓపెన్ టెన్త్ పాసైన వారు కూడా రెగ్యులర్ ఇంటర్మీడియట్‌కు అర్హులన్నారు. ఎటువంటి ఫీజు లేదని, అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. నూతన కళాశాల అడ్మిషన్లుపై ప్రత్యేకంగా మైకుల ద్వారా ప్రచారంతో పాటు కరపత్రాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

అప్పాపురంలో పోలీసుల తనిఖీలు



నాదెండ్ల: సమస్యాత్మక గ్రామమైన అప్పాపురంలో పోలీసులు గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్సై జె.బలరామిరెడ్డి, రూరల్ ఎస్సైలు రవికృష్ణ, బాలకృష్ణ, యడ్లపాడు ఎస్సై రాజు, సిబ్బందితో కలిసి బృందాలుగా విడిపడి గ్రామాన్ని జల్లెడపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మారణాయుధాలు, పెట్రోల్ బాంబులు వంటి వాటిని గుర్తించేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

వేసవి శిక్షణ తరగతులు



వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని వినుకొండ శాఖ గ్రంథాలయలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా 8వ రోజు గురువారం విద్యార్థులకు కథలు చదవడం, కథలు చెప్పడం, మేథ్స్ బేసిక్ క్లాస్‌లు నిర్వహించారు. అనంతరం మ్యూజికల్ చైర్ తదితర ఆటలు నిర్వహించడం జరిగిందని గ్రంథాలయ శాఖాధికారి భూక్యా బద్రీనాయక్ తెలిపారు.

జ్ఞానసముపార్జనకు పుస్తక పఠనమే మార్గం

నాదెండ్ల: విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, మెరుగైన జ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనం ఏకైక మార్గమని నాదెండ్ల శాఖా గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను పురస్కరించుకుని గురువారం నూతన పుస్తకాల పరిచయం నిర్వహించారు. చిన్నారులకు పలురకాల కథల పుస్తకాలు, సైన్స్, గణితం, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందించి అందులోని విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలతో పాటూ గ్రంథాలయాల్లోని విషయజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను చదవాలని కోరారు.

చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ

సత్తెనపల్లి: జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు పట్టణంలోని నరసరావుపేట రోడ్‌లో గల చెక్‌పోస్ట్ వద్ద గురువారం పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డాక్యుమెంట్స్ లేని ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నారు. దీనిపై పట్టణ ఎస్ఐ ఎం.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణి, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

వయోజనులకు వ్యాధి నిరోధక టీకాలు



సంతగుడిపాడులో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐవో డాక్టర్ గీతాంజలి



గణపవరం శాంతినగర్ సచివాలయంలో బీసీజీ వ్యాక్సిన్లు వేస్తున్న ఏఎన్ఎంలు, ఆశలు



గంటావారిపాలెంలో టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేస్తున్న వైద్యులు



బొల్లాపల్లిలో మహిళకు బీసీజీ వ్యాక్సిన్ వేయిస్తున్న వైద్యబృందం

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గురువారం నిర్వహించిన వయోజన క్షయ వ్యాధి నివారణ టీకాలు 425 మందికి వేసినట్లు వైద్యాధికార్లు తెలిపారు. రొంపిచర్ల ఆరోగ్య కేంద్రం పరిధిలోని 11 సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల్లో 208 మందికి, వి.రెడ్డిపాలెం ఆరోగ్య కేంద్రం పరిధిలోని 7 సచివాలయాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో 217 మందికి వయోజన క్షయ వ్యాధి నివారణ టీకాలు వేశారు. సంతగుడిపాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వయోజన క్షయవ్యాధి నివారణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారు విధిగా టీకాలు వేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి బారిన పడి తగ్గినవారు, ధూమమద్యపానం అలవాటు ఉన్నవారు, టీబీ మందులు వాడుతున్న రోగి కుటుంబ సభ్యులు ఈ టీకాలను వేయించుకోవాలన్నారు. అలగే ఈ నెల 30వ తేదీన కూడా మరో పర్యాయం టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి టీకాలు వేసేందుకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను, ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారి డాక్టర్ రేవతిభాయి, ఎంపీహెచ్ఈవో ఎస్.ఎస్. సురేష్ కుమార్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, హెల్త్ సూపర్‌వైజర్‌లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొని సేవలు అందించారు.

అరవై ఏళ్లు పైబడిన వారికి ఉచితంగా..

నాదెండ్ల: అరవై ఏళ్లు పైబడి పలు సమస్యలతో బాధపడుతున్న వారికి సచివాలయాల్లో ఉచితంగా బీసీజీ వ్యాక్సిన్లు వేస్తున్నట్లు ఏఎన్ఎంలు తెలిపారు. అరవై ఏళ్లు పైబడిన వారికి డయాబెటిస్, పొగత్రాగే అలవాటు ఉన్న వారు, టీబీ వ్యాధి సోకి ఐదేళ్లు దాటిన వారికి, ప్రస్తుతం టీబీ వ్యాధిగ్రస్తులున్న కుటుంబ సభ్యులందరికీ బీసీజీ వ్యాక్సిన్లు వేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 16న ప్రారంభమైన వ్యాక్సిన్ల పంపిణీ మూడు నెలల పాటూ అన్ని సచివాలయాల్లో ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. ఈ వ్యాక్సిన్లు వేయించుకున్న వారికి క్షయవ్యాధి సోకకుండా నివారించుకోవచ్చన్నారు. అదేవిధంగా 18 ఏళ్లు పైబడి వయస్సుకు తగ్గ బరువు లేని వారికి సైతం వ్యాక్సిన్లు వేస్తున్నట్లు తెలిపారు.

బొల్లాపల్లి మండలంలో....

బొల్లాపల్లి : వయోవృద్ధులు క్షయవ్యాధి బారిన పడకుండా బీసీజీ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శంకర్‌నారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆ గ్రామానికి సంబంధించి వయోవృద్ధులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని 6 సచివాలయాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

సుమారు 214 మందికి వ్యాక్సిన్ వేయడం జరిగిందని తెలిపారు. వారంలో ఒక్క రోజు గురువారం ఈ వ్యాక్సినేషన్ ఉంటుందని తెలిపారు. పొగతాగడం, షుగర్ వ్యాధిగ్రస్తులకు, క్షయవ్యాధిగ్రస్తులకు సన్నిహితంగా వ్యవహరించే వారికి, 60 సంవత్సరాలు పైబడిన వారికి ఈ వ్యాధి నివారణకు ముందుగా బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నామని తెలిపారు. వయోవృద్ధులు ఆయా సచివాలయాల పరిధిలో వ్యాక్సిన్‌కు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో ఎస్.రవి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురం మండలంలో...

శావల్యాపురం: అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ (టీకా) కార్యక్రమం మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం జరిగినట్లు మండల ప్రాథమిక వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ తెలిపారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్షయ వ్యాధి నూరు శాతం నిర్మూలన దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అధికంగా పొగత్రాగేవారు, గతంలో క్షయ (టీబీ) వ్యాధిన బారిన పడి ప్రస్తుత కొలుకున్న వారందరు తప్పనిసరిగా టీకా చేయించుకోవటం ద్వారా భవిష్యత్‌లో క్షయ వ్యాధి రాకుండా ఉంటుందన్నారు.

ఈటీకా వలన ఎలాంటి సైడు ఎఫెక్టులు ఉండవన్నారు. 11 గ్రామ సచివాలయాల పరిధిలో 300 మందికి టీకా చేసినట్లు వైద్యాధికారి చెప్పారు. మూడు నెలల పాటు ఈ టీకా కార్యక్రమం జరుగుతుందని ప్రతినెలా ప్రతి గురువారం బీసీజీ టీకాను వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో చేస్తారన్నారు. 18 నుంచి 60 సంత్సరాల పైబడిన వారందరూ తప్పనిసరిగా ఈటీకాను చేయించుకోవాలని సూచించారు.

చౌడేశ్వరీ దేవి అమ్మవారి జ్యోతిమహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీ అమ్మవారు



చౌడేశ్వరీ అమ్మవారి ఊరేగింపు

రొంపిచర్ల: మండల కేంద్రంలో వేంచేసియున్న శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో గురువారం జ్యోతి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా, అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అలంకరణ పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. రెండు రోజుల పాటు జరిగే అమ్మవారి జ్యోతి మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజున ఆయుధ పూజ నిర్వహించారు. గ్రామంలోని చెరువుకట్ట సెంటర్లో గల మంచినీళ్ళ బావి వద్ద చౌడేశ్వరీ అమ్మవారి ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల నిర్వహణ అనంతరం అమ్మవారి ఆయుధాలకు గ్రామంలో కనకతప్పెట్లతో, సన్నాయి మేళాలలతో గ్రామోత్సవం నిర్వహించారు.

ఈ సందర్భంగా చెక్క భజనతో, అమ్మవారి గేయాలు ఆలపిస్తూ సాగిన ఊరేగింపు సాగింది. అమ్మవారి ఆయుధాల ఊరేగింపు కార్యక్రమం గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామంలో గల తొగట, వీర, క్షత్రియల ఆధ్వర్యంలో అమ్మవారి జ్యోతి మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు మహోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంటర్ సప్లిమెంటరీకి సర్వం సిద్ధం

సత్తెనపల్లిలో 3 కేంద్రాల్లో నిర్వహణ

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలను సత్తెనపల్లి పట్టణంలో మూడు కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 4,447 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణకు సంబంధించి సిబ్బందిని నియమించారు. పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల, కృష్ణవేణి జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రగతి జూనియర్ కళాశాలలో మొత్తం 1,155 మంది, కృష్ణవేణి జూనియర్ కళాశాలలో 979 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2,313 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా శుక్రవారం జరిగే సెకండ్ లాంగ్వేజ్ పేపర్–1కు సంబంధించి ప్రగతి జూనియర్ కళాశాలలో 120 మంది, కృష్ణవేణి జూనియర్ కళాశాలలో 83 మంది, సెకండ్ లాంగ్వేజ్ పేపర్–1, పేపర్–2కు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 103 మంది కలిపి మొత్తం 306 మంది పరీక్ష రాయనున్నారు.

విద్యతోనే గౌరవం



భట్లూరులో విద్యా చైతన్య ప్రచారోద్యమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్

సత్తెనపల్లి: సమాజంలో గౌరవం పొందాలంటే విద్య తప్పనిసరి అని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ వి.ప్రదీప్ అన్నారు. సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామంలో గురువారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన విద్యా చైతన్య ప్రజారోద్యమ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి బడికి వెళ్లి చదువుకోవటం వలన గౌరవంగా ఉంటారన్నారు. చదువుకోవటం వలన పరిశుభ్రత, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత అన్నీ తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఆ దిశగా విద్యనభ్యసించడం ద్వారా అందరికీ సమాన అవకాశాలు ఉంటాయన్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి ప్రభుత్వం అందిస్తున్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక ద్వారా ఉన్నటువంటి అవకాశాలను పొందాలన్నారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలందరిని తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొని విద్యా చైతన్య ప్రచార ఉద్యమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది మౌనిక, తదితరులు ఉన్నారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి వార్షికోత్సవం



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలోని పోలేరమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తొండపిలో అద్దంకమ్మ తల్లి తిరునాళ్ల

మండలంలోని తొండపి గ్రామంలో వేంచేసియున్న అద్దంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణ నేపథ్యంలో గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తప్పిపోయాడు.. క్షేమంగా ఇంటికి చేరాడు

నాదెండ్ల: ఇంటి నుంచి బయటకు వెళ్లి తప్పిపోయిన మతిస్థిమితం లేని వృద్ధుడి ఆచూకీ గురువారం లభ్యమైంది. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం, వేములపాడు గ్రామానికి చెందిన ముప్పరాజు లక్ష్మీనారాయణ ఈ నెల 19న గణపవరంలో నివసించే తన కుమార్తె ఆలా శ్రీలక్ష్మి ఇంటికి వచ్చాడు. సాయంత్రం బయటకు వెళ్లిన లక్ష్మీనారాయణ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వెతుకులాట ప్రారంభించిన పోలీసులు గురువారం ఉదయం గణపవరంలోని వేలూరు డొంకలో వృద్ధుడిని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో లక్ష్మీనారాయణను కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తరలించారు.

ఎవరో.. గుర్తుతెలియని మృతుడు?



నరసరావుపేట టౌన్: గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. మార్కెట్ సెంటర్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో సుమారు 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్న సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించామన్నారు. మృతుడి ఆనవాళ్లు తెలిసినవారు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

9న ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

సత్తెనపల్లి: హైందవ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ జూన్ 9న పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో జరుగుతుందని ఛత్రపతి శివాజీ కళా పరిషత్, ఛత్రపతి శివాజీ యూత్, ఆర్య మరాఠ సంఘం బాధ్యులు గురువారం తెలిపారు. జూన్ 9న మధ్యాహ్నం 12.21 గంటలకు ఈ విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు.ఉదయం 9.00 గంటలకు కాషాయం ధ్వజ పూజ, 9.30 గంటలకు తుల్జాభవాని అమ్మవారి పూజ, 10.00 గంటలకు తుల్జాభవాని అమ్మవారి హోమం జరుగుతుందన్నారు.

రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

సత్తెనపల్లి: పచ్చిరొట్ట పైరు తొలకరి వర్షాలకు వేయడం ఎంతో మంచిది. జీలుగ, జనుము, పిల్లి పెసర తదితర పైర్లు ఇందుకు అనువైనవి. పంట పూత దశకు రాగానే కలియ దున్నేయాలి. పచ్చి రొట్టె పైర్లు సంపూర్ణ ఎరువులు. వీటిలో పంటకు కావలసిన ముఖ్యపోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్, ఉపపోషకాలైన కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్, సూక్ష్మ పోషకాలైన జింక్, బోరాన్, ఇనుము తదితరాలు లభ్యమవుతాయని సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పచ్చిరొట్ట ఎరువు పైర్లు సాగు లాభదాయకమని చెప్పారు. జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తన ధరలను రాష్ట్ర వ్యవసాయ శాఖ ఖరారు చేసిందన్నారు. సత్తెనపల్లి మండలానికి జీలుగ 55 క్వింటాళ్లు, జనుము 64 క్వింటాళ్లు, పిల్లిపెసర 100 కింటాళ్లు మొత్తం 219 క్వింటాళ్లు ప్రతిపాదించటం జరిగిందన్నారు. 50 శాతం రాయితీపై రైతులకు అందజేస్తా మన్నారు. వీలైనంత త్వరలో రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలు సరఫరా చేయనున్నామని, విత్తనాలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలని ఆయన తెలిపారు.

పారదర్శకంగా విధులు నిర్వహించాలి



అనుమతి పత్రాన్ని అందుకుంటున్న పశువైద్య సహాయకులు

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లో పాడిరైతులకు మెరుగైన సేవలు పారదర్శకంగా అందజేయాలని ఎంపీడీవో కొత్రపాటి కవితా చౌదరి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పశుసంవర్ధకశాఖ సహాయకులు 45 రోజుల శిక్షణ తరగతులు పూర్తి చేసుకోని మళ్లీ విధుల్లో హాజరవుతున్న సందర్భంగా పశువైద్య సహాయకులు ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామసచివాలయాలు పరిధిలో నిరంతరం అందుబాటులో ఉంటూ జాబ్ చాట్ ఆధారంగా పాడి రైతులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సేవలు సకాలంలో అందించాలన్నారు. అంకిత భావంతో విధులు నిర్వహించిన ఉద్యోగులు ప్రజల్లో మంచి గుర్తింపు పొందుతారన్నారు. అనంతరం కనమర్లపూడి, శానంపూడి, పిచికలపాలెం, మతుకుమల్లి, గుంటుపాలెం గ్రామ సచివాలయాల పశువైద్య సహాయకులు విధుల్లో చేరేందుకు ఎంపీడీవో అనుమతి పత్రాలు పొందారు.

వైభవోపేతంగా రంగనాథుని కల్యాణం



కల్యాణ వధూవరులుగా శ్రీదేవి భూదేవి రంగనాథుడు



కల్యాణ వేడుకలకు హాజరైన భక్తజనం

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో వేంచివున్న శ్రీభూ–సమేత రంగనాయక స్వామి ఆలయం భక్తులతో కళకళలాడింది. నవ వధూవరులుగా శ్రీదేవి భూదేవి రంగనాయక స్వామి సర్వాంగ సుందరంగా అలంకార కృతులయ్యారు. పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు పరుచూరి రామకృష్ణమాచార్యులు నేతృత్వంలో కల్యాణ వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామస్తులే కాకుండా సమీప గ్రామాలు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణ పూజలను ఆలయ ధర్మకర్తలు అరవపల్లి మనోహర్, నాగజ్యోతి దంపతులు, అరవపల్లి బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే ఉపాలయంలో కొలువున్న ప్రసన్నాంజనేయ స్వామికి విశేష అలంకరణ గావించారు. ఆయా కార్యక్రమాలను ఈవో పర్యవేక్షించారు. గ్రామ పెద్దలు ప్రజలు సహకార అందించారు. అనంతరం ఉత్సవమూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు.

ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణ పరిరక్షణ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

నరసరావుపేట రూరల్: ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ఆఫీసర్ డాక్టర్ ఎం.లత తెలిపారు. జాతీయ సేవా పథకంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండలంలోని రావిపాడులో ప్లాస్టిక్ నిషేధంపై గ్రామంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిత్యం ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులు, సంచుల వలన పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు. దీంతో పాటు మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. క్యాన్సర్, నరాల బలహీనత వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. ప్లాస్టిక్ బదులుగా గ్లాస్, స్టీల్‌ను ఉపయోగించాలని సూచించారు. అలాగే సాయంత్రం సమయంలో మహిళలకు పెరటి తోటల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి కూరగాయల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ టి.రమేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

మరోమారు చోరీకి విఫలయత్నం



దుకాణంలో చోరీ ప్రయత్నం చేస్తున్న గుర్తు తెలియని దుండగుడు (సీసీ ఫుటేజ్)

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో ఓ దుకాణంలో చోరీకి విఫలయత్నం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. లింగారావుపాలెం గ్రామానికి చెందిన తులాబందుల సప్తాంజనేయులు యడ్లపాడు హైవే పక్కన సరుకుల దుకాణంలో బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని దుండగుడు చోరీకి యత్నించాడు. రోజు మాదిరిగానే వ్యాపారం ముగిసిన వెంటనే దుకాణానికి తాళాలు వేసుకుని ఆంజనేయులు వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం దుకాణం తెరిచేందుకు తాళాలు చూడగా మూడు తాళాలు రెండు పగలగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి దుకాణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలను గమనించాడు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ముఖానికి ధరించి బ్లూ కలర్ దుస్తులతో వచ్చిన యువకుడు దుకాణం రెండు తాళాలను ధ్వంసం చేసినట్లు గుర్తించాడు. అదే సమయంలో పాల వాహనాలు దుకాణం వైపు రావడంతో భయంతో చోరీయత్నాన్ని విరమించుకొని అక్కడి నుంచి దుండగుడు ఉడాయించాడు. రెండు నెలల కిందట ఇదే దుకాణంలో తాళాలు పగలగొట్టి గల్లా పెట్టెలోని రూ.6 వేల నగదు చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు



అమరావతి: ప్రముఖ బౌద్ధ కేంద్రంగా వెలుగొందుతున్న అమరావతిలో బుద్ధ జయంతిని పురస్కరించుకుని గురువారం బౌద్ధ సంప్రదాయనుసారం పూజలు నిర్వహించారు. స్థానిక పాత మ్యూజియంలోని మహాచైత్యం వద్ద ధాన్య కటక బౌద్ధ విహార ట్రస్టు చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు ఆధ్వర్యంలో స్తూపారాధన, పుష్పార్చన నిర్వహించి, ఆచార్య నాగార్జున విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మ్యూజియంలోని బుద్ధుని విగ్రహం వద్ద బుద్ధ వందనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నిమ్మా విజయ సాగరబాబు, యోగాశ్రమ కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మీ పండిట్, తదితరులతో పాటు గ్రామస్తులు, బౌద్ధ మతాభిమానులు పాల్గొన్నారు.

నేటి నుంచి 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో నేటి నుంచి 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మల్లిఖార్జున శర్మ గురువారం తెలిపారు. పరీక్ష కేంద్రంలో రాజుపాలెం, బెల్లంకొండ మండలాలకు చెందిన 300 మంది విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లు తీసుకొని పరీక్ష కేంద్రానికి రావాలని తెలిపారు.

8 వేల పాఠ్య పుస్తకాలు సిద్ధం

పాఠశాలలు పునః ప్రారంభానికి ముందుగానే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో మల్లిఖార్జున శర్మ తెలిపారు. ఇప్పటికే విద్యాశాఖాధికారి కార్యాలయానికి మొదటి విడతగా 8 వేల పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు పాఠశాలల పునః ప్రారంభానికి ముందే పంపిస్తారని చెప్పారు.